1996 జూలై 2వ తేది  సాయికుల్వంత్‌హాల్‌లో భగవాన్ దివ్యోపన్యాసం

# ఆచరణ లేని విద్యలు నిరర్థకము

**బహుళ విద్యలయ్యె వాంఛలు మితిమీరె**
**పలుకులందు హీరో పనికి జీరో**
**తెలివితేటలు ఎన్ని ఉండి ఫలంబేమి**
**కొంచెమైన ఆచరించరయ్య.**

విద్యార్థులారా!

ఈనాటి విద్యలు కేవలము భౌతికమైన సుఖశాంతుల నిమిత్తము ప్రాకులాడుచున్నాయి గానీ సమాజముయొక్క సంక్షేమము నిమిత్తమైగాని, ధర్మస్థాపన నిమిత్తమైగానీ, లోక శాంతి నిమిత్తమైగానీ ఈ విద్యలు ఏమాత్రం కృషిచేయటం లేదు. విద్యార్థులు గానీ, విద్యావంతులుగానీ అమితమైన జీతము నాశించి ఉద్యోగములో ప్రవేశించుటకు ఎంతయో ప్రయత్నిస్తున్నారు. ఉద్యోగము పురుష లక్షణమని భావించి, దేశపరిపాలన నిమిత్తమైకాక స్వార్థము నిమిత్తమై ఈ విద్యలను ఉపయోగించుచున్నారు. తెల్లవారి ఎనిమిదిగంటలకు ఆఫీసులకు వెళ్ళి లేక కళాశాలలకు వెళ్ళి సాయంకాలము నాలుగు గంటలకు తిరిగి ఇంటికి వస్తున్నారు. ఆఫీసులయందు, కళాశాలలందు తాము ఏదో శ్రమపడినట్లుగాను తీరని పనులలో మునిగినట్లుగా ఇంటికి వచ్చిన తక్షణమే తమ డ్రస్సు మార్చుకొని, అలంకరించుకొని విశ్రాంతి నిమిత్తమై, శాంతి నిమిత్తమై క్లబ్బులలో ప్రవేశిస్తున్నారు. ఈ క్లబ్బులలో శాంతి ఉన్నదా? ఈ క్లబ్బులు విశ్రాంతి నందిస్తున్నవా? లేదు, లేదు.

ఇది కేవలము విద్యావంతుల బలహీనత. నిజముగా విశ్రాంతి కావాలంటే బెడ్‌రూమ్‌లో పడకపై పడుకోవచ్చు. కానీ, ఈనాటి విద్యావంతులు తమ శాంతి, తమ విశ్రాంతి క్లబ్బులలో నున్నదని భ్రమించి ఆ క్లబ్బులలో ప్రవేశిస్తున్నారు. అక్కడకు వెళ్లి ఏమి చేస్తున్నారు? కార్డులు ఆడుతున్నారు. ఇంతటితో ఆగక బాటిల్స్ తీసుకుంటున్నారు. దానివల్ల మైమరచిపోయి అలసట తీరుతుందని భావిస్తున్నారు. ఇది ఉత్తమ మార్గమా? అదో మార్గము! ఇది విద్యావంతులు

sri sathyasai vachanamrutam

చేయవలసిన పనియా? విద్యాహీనులు చేయవలసిన పనియా? ఇందులో శాంతి ఉన్నదని తప్ప త్రాగి మైమరచి ఏదో శాంతిని పొందాను అని భ్రమిస్తున్నారు. కానీ, ఇది చాలా ప్రమాదకరమైనది. తనకు తాను చెడిపోవడమే కాక సమాజమును చెడగొట్టి గృహమునుకూడ అనేక అష్టకష్టములకు గురిచేస్తున్నాడు. ఇట్టి దురభ్యాసములు మానుకొని, ఇట్టి దురభ్యాసములకు అవకాశము నందించక గృహసంబంధమైన కార్యములలో లేక సమాజ సంబంధమైన కార్యములలో ప్రవేశించి తమ విద్యను సార్థకము గావించుకోవాలి. ఈ త్రాగటము ఎంతవరకు బయలుదేరుతున్నది. First man drinks wine; next wine drinks the wine; next wine drinks man. కట్టకడపటికి వైన్ తననే మింగివేస్తుంది. ఈ సత్యము గుర్తించుకొనలేక తెలివితేటలు గలవారమని భ్రమించి ఈవిధమైన అపమార్గములలో ప్రవేశిస్తున్నారు. ఏదో తమ మిత్రులకు సహాయము చేసినట్లుగా భావిస్తుంటారు. ఏమిటి? తనతో కార్డ్స్ ఆడటానికి వచ్చినవానికి థాంక్స్ చెప్పటము. తనతో బాటు టేబుల్ దగ్గర బాటిల్స్ తీసుకున్నవారికి థాంక్స్ చెప్పటం. ఇది ఎంత విద్యాహీనమైనదో మీరు చక్కగా యోచించుకోవచ్చు. విద్యయొక్క సహజలక్షణము కాదు.

**పంచభూతములన్నీ భగవంతుని స్వరూపములే !**

మనము ఒక గ్రామములో నుండినప్పుడు, ఎవరైనా మనకు సహాయము చేసినప్పుడు, మాట్లాడినప్పుడు థాంక్స్ అంటాము. మన కర్చీఫ్ క్రిందపడినప్పుడు ఎవరైనా తీసిఇస్తే థాంక్స్ అంటాము. నీరు మన గృహమునకు సప్లై చేసినందుకు వాటర్ టాక్స్ కడుతున్నాము. మన ఇంటికి కరెంటు సప్లై చేస్తే దీనికి ఎలక్ట్రిసిటీ చార్జ్ అనే టాక్స్ కడుతున్నాము. మనము కొనుక్కున్న స్థలములో ఇల్లు కట్టుకుంటే హౌస్‌టాక్స్ ఇస్తున్నాము కార్పొరేషనుకు. భగవంతుడు అనుగ్రహించే వరప్రసాదము లెట్టివి? ఫ్యానువేసుకుంటే కరెంటుకు ఛార్జీ కడుతున్నాము. భగవంతుడు మలయమారుతము ఇస్తుంటే ఏమి టాక్సు కడుతున్నాము. సూర్యుడు దేదీప్య మానముగా ప్రకాశిస్తూ జగత్తుకు వెలుగు నందిస్తున్నందుకు సూర్యునికి ఏమి టాక్స్ అందిస్తున్నాము? కుంభవర్షము కురిసి వాగులు, వంకలు ప్రవహించి చెరువులు నిండి ఎక్కడ చూచినా జలము నందించినందుకు భగవంతునికి మనము ఏమి టాక్స్ ఇస్తున్నాము? అల్పమైన స్వల్పమైన

srisathyasaivachanamrutam

విషయాలకు టాక్స్ కడుతున్నాము. భగవంతుడు అనుగ్రహించినవన్నీ ఫ్రీ. గాలి ఫ్రీ, నీరు ఫ్రీ, లైటు ఫ్రీ, అంతా ఫ్రీగా యిస్తున్నాడు భగవంతుడు. భూమి భగవంతుడు అనుగ్రహించినదే. పంచ భూతములన్నీ భగవంతుని స్వరూపములే! భగవంతునివి అనుభవిస్తూ భగవంతునికి మనము ఏమి టాక్స్ కడుతున్నాము? ఏ మానవుడైనా విద్యావంతుడైనా విచారణ సల్పుతున్నాడా? అనిత్యము, అశాశ్వతము, అసత్యము అయిన విషయములకు మనము టాక్స్ కడుతున్నాము. ఎంతయో కృతజ్ఞత తెలుపుకుంటున్నాము. నిత్యమైన, సత్యమైన, శాశ్వతమైన జీవితమునకు అవసరమైన సమస్త శక్తులు అందించినందుకు ఏమి టాక్స్ కడుతున్నాము? ఇంకా భగవంతుడా అది ఇవ్వలేదు ఇది ఇవ్వలేదు అని దూషిస్తుంటాము. ఉపకారమునకు బదులు అపకారము సలుపుతున్నాము. ఇచ్చిన దానికోసమై టాక్స్ చెల్లించటంలేదు. ఇంకా ఇవ్వలేదని ఆశించటం ఎంత దురాశ? ఈ దురాశ పెరిగిపోవటంచేత దుర్గుణములు కూడా పెరిగిపోతున్నాయి. దుర్గుణములు పెరిగిపోవటంచేత దురహంకారము పెరిగిపోతున్నది.

**భగవంతుని అనుగ్రహమునకు కృతజ్ఞత తెలుపుకోవడమే ప్రార్థన**

దురాశ, దురహంకారము, దుర్గుణములు మానవుని సహజ లక్షణములు కావు. శాంతము, సహనము, సానుభూతి ఇవియే మానవుని ప్రధాన లక్షణములు. నిజముగా మానవుడు సంతృప్తిగా జీవించాలి. ఈనాటి మానవునకు సంతృప్తే లేకుండా ఉంటున్నది. తృప్తియే లేదు. ఒకానొక సమయంలో ఒక భక్తుడు నారాయణుని దర్శించాడు. 'నారాయణా! నీవు ఎందుకోసం ఈ మేరు పర్వతము సృష్టించావు? బంగారు కొండను సృష్టించావు. ఓ భగవంతుడా అడవులనంతాపెంచి మానవులకు జీవశక్తిని ప్రసాదిస్తున్నావు. మానవుడు వదిలిన కార్బన్ డయాక్సైడ్ చెట్లన్నీ తీసుకొని ప్రాణవాయువునందిస్తున్నాయి. కొండలు సృష్టిస్తున్నావు. కదలిపోయే మేఘములను ఆపి వర్షము కురిపిస్తున్నావు.

**మౌళి గుల్కెడు చంద్ర మఖండ కళతోడ**
**బెడగారు గుంపెడు జడలతోడ**
**జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ**
**దంబైన ఫాలనేత్రంబు తోడ**

sri sathyasai vachanamrutam

నల్ల నేరేడు వంటి నల్లనిమెడతోడ
కరమున నాగకంకణము తోడ
నడుమున చుట్టిన నాగచర్మము తోడ
మైనిండ నలదు భస్మంబు తోడ
నుదుట తీర్చిన దొడ్డ కుంకుమబొట్టుతో
తాంబూల రాగాధరమ్ముతోడ
నల్ల కలువల హసియించి కొల్లలాడు
మెరుగు చామనచాయ మేనితోడ...

భగవంతుడు సుందరమైన జగత్తుకు మరింత సౌందర్యమును కలిపిస్తూ వచ్చాడు. ఎక్కడ పెట్టుకున్నాడు చంద్రుని? లైట్ హవుస్ మాదిరి పెట్టుకున్నాడు భగవంతుడు. చల్లదనము అందరికి అందిస్తున్నాడు. జడల నుంచి ప్రవహించే నదులతో, ఫాలనేత్రముతో జగత్తునంతా మెరిపించి మురిపించే సృష్టిని తాను కలిగించి సర్వమానవులకు సుఖశాంతుల నందిస్తూంటే ఈ కల్పితమైన, అల్పమైన సుఖశాంతుల నిమిత్తమై అఱ్ఱులు చాస్తున్నాడు మానవుడు. మానవునకు హృదయమును అనుగ్రహించాడు. ఎట్టి హృదయము? చల్లని హృదయము. కరుణా హృదయము, ప్రేమ హృదయము, జాలి హృదయము. ఇలాంటి హృదయము నందించినా మనము పాడుచేసుకుంటున్నాము. ఈవిధమైన హృదయమును మనము అపవిత్రము గావించుకోటం కేవలము మానవత్వమునకే తీరని లోటుగా ఉంటున్నది.

ఇంత అనుగ్రహము నందించిన భగవంతునికి మనము టాక్స్ కట్టాలి. ప్రాచీన కాలమందే మహర్షులు 'బలి' అని పేరుపెడుతూ వచ్చారు. భగవంతునకు బలి ఇవ్వటము. ఒక ప్రాణిని భగవంతునకు బలి ఇవ్వటమని అపార్థము చేసుకున్నారు ప్రజలు. బలి అనగా ప్రాణిని హింసించటం కాదు. బలి అనగా  టాక్స్ అని అర్థము. పదమునకు ఎన్ని అర్థములో ఉంటున్నాయి చిన్న ఉదాహరణ. మనం శిఖండి అని పిలుస్తున్నాము. శిఖండి అనగా ఆడ, మగ కాని దానిని శిఖండి అని పెడార్థము తీసుకుంటున్నాము. నారాయణుని పేరే శిఖండి. నెమలి పింఛము ధరించిన వాడని అర్థము. అనగా కృష్ణుడు. ఇలాంటి పవిత్రమైన అర్థములు ఎన్నియో ఉండగా దీనిని మనం అర్థము చేసుకొక కేవలం అనర్థాలు తీసుకొని దానిని

sri sathyasai vahanamrutam

యథార్థముగా విశ్వసిస్తున్నాము. బలి అనగా హింసించటంకాదు. భగవంతునికి టాక్స్ అందించాలి. మన యొక్క కృతజ్ఞత భగవంతునికి తెలుపుకోవటమే టాక్స్. అది ఏవిధంగా తెల్పుకోటం. ప్రార్థనతో తెల్పుకోటమే. నీ హృదయమునుండి ఆవిర్భవించిన ఆనందమును భగవంతునికి వాక్‌రూపములో అందించటమే.

**నాలుక ఇచ్చినది భగవంతుని నామాన్ని స్మరించటానికే!**

దీనినే పోతన కూడా చెప్పాడు:

**చేతులారంగ శివుని పూజింపడేని**
**నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని...**

అటువంటివాడు పుట్టి ప్రయోజనమేమిటి? ఏ అభిమాన మమకారములు  లేకుండా ఎంతమంది వింటారో ఏమిటోనని, ఎగతాళి చేస్తారేమోననే భావమును త్యాగంచేసి కంఠము ఎత్తి భగవంతుని ప్రార్థన చేయాలి. కొంతమంది కంఠం ఉండికూడా భగవంతుని నామాన్ని స్మరించలేకపోతున్నారు. ఎందుకు వారికీ నాలుక ఉంది? కేవలం తినటానికా? నాలుక ఉండికూడా భగవంతుని భజనలు పాడలేకపోతున్నారు. ఇది కేవలం కర్మఫలమే. ఇది కేవలం కప్పనాలుక మాత్రమే. అసలు నాలుక ఉన్నది ఎందుకోసం? భగవంతుని నామాన్ని స్మరించటానికే నాలుక ఇచ్చాడు. అతనిని స్మరించి నీ ట్యాక్స్ చెల్లించుకో. లేకపోతే నీవు ఋణగ్రస్థుడైపోతావు. చేతులుండి కూడా భగవంతుని భజించలేకపోయినప్పుడు చేతులుండి ఏమి ప్రయోజనము?

భగవంతునికి ట్యాక్స్ చెల్లించుటకు ఒక పద్ధతి ఉంది. అది మనం చెల్లించలేకపోతే ఋణగ్రస్థులమై పోతాము. భగవంతుని దూషించిన వారమవుతాము.

**పరుల దూషించిన పాప ఫలంబబ్బు**
**విడువదెన్నటికిని విశ్వమందు**
**పరులు పరులు కాదు, పరమాత్మయే కదా!**

పరులు, పరులు అని అనుకుంటున్నాము. పరులెవరూ లేరిక్కడ. పరమాత్మయే ఉండేది. పరులంతా పరమాత్మ స్వరూపులే. కనుక ఎవరినీ మనం విమర్శించరాదు. ఎవరినీ మనం దూషించరాదు. అందరికీ తగిన కృతజ్ఞత నందించాలి. జగత్తులో ప్రతిమానవునివద్దనుండి

sri sathyasai vachanamrutam

అంతో ఇంతో ఉపకారం మనం అందుకుంటున్నాము. కాని, మనము అనేక యుక్తులచేత కృతజ్ఞతలు తెలుపకుండా తప్పించుకొనుటకు పన్నాగము పన్నుతున్నాము. నిజముగా ఈనాటి విద్యలన్నీ పెడమార్గము పట్టిస్తున్నాయి. దీనికి ఒక కథ ఉంది. మీకందరికి తెలుసు. అనేక పర్యాయములు చెప్పాను.

**భగవంతుడిచ్చిన హృదయమును భగవంతునికి తిరిగి అర్పించాలి**

ఒక కొలనులో ఒక మొసలి జీవిస్తూ ఉండేది. ఆ కొలను పక్కనే ఒక పెద్ద వృక్షము ఉండేది. ఆ వృక్షముపై ఒక కోతి నివసిస్తూ ఉండేది. ఆ వృక్షము నేరేడు వృక్షము. ఆ ఫలములన్నీ భుజిస్తూ ఉండేది. ఇవి భుజించటం, క్రింద పడవేయటం, ఆ క్రింద పడవేసిన నేరేడు పండ్లను మొసలి తినేది, ఆనందించేది. ఈ విధంగా జీవించి ఆ మొసలి బలిసింది. ఈ కోతికి, మొసలికి చక్కని స్నేహం ఏర్పడింది. ఈ మొసలి చెప్పింది: "ఓ కోతిబావా? నీ దగ్గరనుండి నేను విందు ఆరగిస్తున్నాను. కనుక, నీవుకూడా ఒక రోజు మా ఇంటికి వచ్చి మా విందు ఆరగించాలి" అంది. కోతికి ఆశ్చర్యం వేసింది. 'ఇది ఎక్కడికి రమ్మంటున్నది? ఎక్కడ నివసిస్తున్నది', అని ఆలోచించింది. ఈ కోతి మానవుని పూర్మజన్మమే. బాగా తెలివితేటలున్నాయి. ఏదో కోతి అని మనము అంటాం, కాని కోతికున్న తెలివితేటలు మనిషికి కూడా లేవు. అందువలనే శ్రీరాముని దాసుడుగా తయారయ్యాడు హనుమంతుడు. ఎంత కార్యమును సాధించాడు! 'సరే' అని ఈ కోతి ఒప్పుకుంది, పాపం. 'నేనెలా వచ్చేది మీ ఇంటికి? నేను నీటిలో దిగలేను. నీవు నీటినుండి గట్టుకు రాలేవు. కనుక నేను మీ ఇంటికి రాలేను' అంది. అప్పుడు మొసలి, "అయ్యో స్నేహితుడా! నాకు ఇంత పెద్ద దేహముంది నాపైన కూర్చో నేను తీసుకుపోతాను పడవ మాదిరి', అని చెప్పింది. సరిగ్గా ఆ పక్కగట్టుకు చేరటానికి ముందుగా చెప్పింది మొసలి తన రహస్యాన్ని: 'లేదు, లేదు కోతిబావా, నీ గుండెను తినాలని నా భార్య చాలా ఆశపడుతున్నది. నా భార్యకు తృప్తినివ్వాలి. అందుకొరకు నిన్ను ఇక్కడకు తెచ్చాను', అంది. కోతి చాలా యోచన చేసింది. 'ఒరే పిచ్చివాడా! నీ భార్యను తృప్తిపరచటం నాకుకూడా సంతోషమే! కానీ      అప్పుడే ఎందుకు చెప్పలేదు? నేను ఎప్పుడూ ఎగురుతూ ఉంటాను కనుక ఎక్కడన్నా పడిపోతుందేమోనని నా గుండెను చెట్టుకి తగిలించి వచ్చాను. తిరిగి వెనక్కిపద'

sri sathyasai vachanamrutam

అంది. 'చెట్టుపై ఒకచోట గుండె భద్రముగా పెట్టాను. పద, వెనక్కు పోదాం. తీసుకొని వచ్చేద్దాము', అంది. ఈ మొసలికి శారీరక బలము దండిగా ఉంది గానీ, బుద్ధి లేదు. ఈనాటి విద్యావంతులవలె ఉంది. గుండె ఇస్తుందనే నమ్మకంతో వెనుకకు వచ్చింది. అప్పుడు కోతి, 'ఉండు, ఇక్కడే. నేను పైకి పోయి గుండె తెస్తాను' అని చెట్టెక్కి పైకిపోయింది. 'ఓ పిచ్చిమొసలీ! గుండెను తీసి తగిలించుటకు వీలవుతుందా? ఈమాత్రం నీకు బుద్ధిలేదా? ఇలాంటివారి స్నేహము నాకక్కరలేదు. నేను నీకు ఉపకారం చేస్తే కడపటికి నన్నే చంపటానికి నీవు ప్రయత్నించావా? ఇదా కృతజ్ఞత? ఇలాంటి కృతజ్ఞత లేనివారి స్నేహం నాకు అక్కరలేదు' అని మొసలితో స్నేహము తెగతెంపులు చేసుకుంది. మనం భగవంతునికి కృతజ్ఞత చూపాలంటే ఈవిధముగా చేయకూడదు.

హృదయము భగవంతునకర్పితము చేయాలి. అదే మనమిచ్చే ట్యాక్స్. అది కూడను తానందించినదే, మనము తెచ్చుకొన్నది కాదు.

**ఏ హృదయంబు నొసగితివొ ఈశ నాకు**
**మగిడి దానినే యర్పింతు మహితమూర్తి**

నీవు ఇచ్చినదే నీకు అందిస్తున్నాను. నేను ఎక్కడ నుండి తేగలను? I am nothing, everything is yours. **'పరగవేరేమి తెత్తు నీ పాదార్చనకు? అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు.'** ఇదే నేను అందించేది. అంతకంటే నేనేమి ఇవ్వగలను? నా సర్వస్వము నీవు ఇచ్చిన సొత్తే. ఇంకా నాదగ్గర వేరే ఏమున్నది? ఏమైనా ఉంటే అది నీవిచ్చినదే. అంతా నీదే. నాది అనేది ఎక్కడా లేదు" అని అర్పితం చేయాలి. ఇదే భగవంతునకు ఇవ్వవలసిన ట్యాక్స్. అది ఇవ్వనంతవరకు ఎన్ని జన్మలైనా మనం ఎత్తవలసిందే. ఎన్ని రూపములైనా ధరించవలసిందే. ఆస్తికుడైనా, నాస్తికుడైనా, ఆస్తిక నాస్తికుడైనా ఇవ్వవలసింది ఇదే.

ఇలాంటి పవిత్రమైన ట్యాక్స్‌ని మనం అందించటానికి సిద్ధంకాకుండా 'భక్తులం, భక్తులం' అని చెప్పుకుంటున్నాం. భక్తి అనేది పేరే! అది ఒక డిగ్రీగా ఉంటున్నది. ఈనాడు ఏదైనా ఉద్యోగం కావాలంటే పేరు వ్రాసి చివర M.B.A.అనో M.F.M.అనో వ్రాసుకుంటారు. ఈ డిగ్రీ చూసే ఉద్యోగాలు ఇస్తుంటారు. ఒకప్పుడు రామయ్య అనుపేరు గల వ్యక్తి ఉద్యోగానికి

sri sathyasai vachanamrutam

పోవాలని అనుకున్నాడు; 'రామయ్య, TDFS', అని వ్రాసాడు. ఏమిటిరా, ఈ డిగ్రీ ఎక్కడ నుంచి వచ్చింది? అని అందరూ ఆశ్చర్యపోయారు. ఆఫీసర్లు అతనిని పిలిచి అడిగితే TD - ten daughters, FS - five sons. ఇది నా డిగ్రీ' అన్నాడుట. పిల్లలను కనటమా డిగ్రీ? ఈనాటి మానవుని పరిస్థితి ఇలా ఉంటున్నది. అది కాదు మన డిగ్రీ. 'శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః' అదే మన డిగ్రీ. "నేను భగవంతుని దాసుడను, భగవంతుని అంశమును." ఆవిధమైన దివ్యమైన తత్త్వాన్ని మనం అనుభవించాలి. 'నీవు నా అంశమే. ప్రకృతి అంశము కాదు. పంచభూతముల అంశము కాదు. సాక్షాత్తు నా అంశమే!' అన్నాడు, భగవంతుడు. ఇలాంటి డిగ్రీలు మనం తీసుకోకుండా తుచ్ఛమైన వాటికోసం ప్రాకులాడి కట్టకడపటికి ఏమైపోతున్నాము?

**శతవర్షములదాక మితము చెప్పిరిగాని**
**నమ్మరాదా మాట నెమ్మనమున**
**బాల్యమందో లేక ప్రాయమందో**
**లేక ముదిమియందో లేక ముసలియందో**
**ఊరనో అడవిలో ఉదక మధ్యంబునో**
**ఎప్పుడో విడిచేది ఎఱుకలేదు**
**మరణమే నిశ్చయము మానవునకు....**

ఎప్పటికైనా అది నిశ్చయము. కనుక ముందుగానే దైవార్పితం చేయాలి. ఇది సత్యమైనది కాదు. దేహము ఒక నీటి బుడగ. Mind is like a mad monkey. Don't follow the mind, don't follow the body, follow the conscience. అదే హృదయము. ఆ హృదయమును భగవంతునికి అర్పితము చేయి. ఆ హృదయాన్ని అర్పించే నిమిత్తమై మనం భక్తులుగా తయారుకావాలిగానీ ఏదో పుష్పమో, ఫలమో, పత్రమో ఇవన్నీ అర్పించుటకు కాదు.

భగవంతుని దగ్గర లేనివి ఏవీ మీదగ్గర లేవు. అన్నీ భగవంతుని దగ్గరున్నాయి. ఇంకా ఎటువంటివి ఉన్నాయో ఎవరికీ తెలియదు. అంత విలువైనవన్నీ ఉన్నాయి భగవంతుని దగ్గర.

sri sathyasai vachanamrutam

కానీ తుచ్ఛమైన ఫలములందించటం, వాడిపోయే పుష్పములందించటం ఇదా మనం అందించవలసిన ట్యాక్స్? దేహమనే పత్రము, హృదయమనే పుష్పము, మనస్సు అనే ఫలము, ఆనందమనే తోయము. ఆనందబాష్పములందించాలి. అంతేగాని శోకబాష్పములు కావు. ఈవిధంగా మనం భగవంతునికి అందించవలసినవి ఎన్నో ఉంటున్నాయి. కానీ అట్టి నిత్య సత్యమైన విషయాలు గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. మన దృష్టికి గోచరించేది మన చర్మచక్షువులకు కన్పించేది మనం అందిస్తున్నాము. ఈ దృశ్య కల్పితమైనవన్నీ ఏదో ఒకనాటికి నశించేవే! అంతా నాస్తి, నాస్తి. ప్రతి ఒక్కటీ అనిత్యము. సత్యమనేది ఒక్కటే నిత్యము. నీ జీవము, దైవశక్తి ఈ రెండింటి ఏకత్వమే జీవాత్మతత్త్వము. ఈనాడు విద్యా విషయములను సక్రమమైన మార్గంలో మనం ప్రవేశపెట్టాలి. కార్డ్సు ఆడటంలో మనకు శాంతిలేదు. తినటంలో మనకు శాంతిలేదు. త్రాగటంలో మనకు శాంతిలేదు. వీటిలో శాంతి ఉంటే 24 గంటలు తింటూ కూర్చోవచ్చు కదా? ఇవన్నీ మనిషిని కేవలం అపమార్గములో నడిపించి రాక్షస మార్గములో ప్రవేశింపచేస్తున్నాయి. మనము త్రాగటానికి, తినటానికి పుట్టినవారము కాదు. మన నిమిత్తమై ఆహారము పుట్టినది గానీ ఆహార నిమిత్తమై మనం పుట్టలేదు. కనుక మనము సత్యమైన జ్ఞానమును, జీవితమును ఆదర్శవంతమైన రీతిలో ప్రజల కందించాలి. మనతోటి మానవులకు పవిత్ర మార్గమును మనం ప్రబోధించాలి. ఏది సత్యనిత్యమైన తత్త్వమో అది ప్రజలకు బోధించటానికి ప్రయత్నించాలి.

**విద్య, విజ్ఞానము కొరకు**

విద్యార్థులారా! మీరు చదివిన చదువులలోని సారమంతా ప్రజలకందించి వారు సద్గతి మార్గంలో నడచునట్లుగా చూచుకోవాలి. విద్య కేవలం పొట్టకూటికోసం కాదు. విద్య విజ్ఞానంకోసం. విజ్ఞానం కావాలి. ఏమిటి ఆ విజ్ఞానము? నిత్యానిత్య పరిశీలనా శక్తి, విచక్షణాజ్ఞానముతో కూడినది విజ్ఞానము. మనము ఈనాడు అనేకమందిని కళ్ళతో చూస్తున్నాము. మన అశాంతి ఎక్కడనో, దానికి చేసే ప్రయత్నం ఏమిటో అర్థమే కావటం లేదు. ఈ రోగమునకు తగిన ఔషధము మనమందించటం లేదు. కడుపులో నొప్పి పుడితే కండ్లలో కాటుక వేస్తే కడుపు నొప్పి ఏమైనా తగ్గుతుందా? రోగం ఒకటి, మన మిచ్చే ఔషధం

sri sathyasai vahamrutam

మరొకటి. అదేవిధంగా మన అశాంతి ఒకటి, ఆ అశాంతి తీర్చేందుకు వాడే ఔషధం ఒకటి. ఫలితంగా మరింత అశాంతికరమైన పనులే చేస్తున్నాము మనం. ఒక తండ్రికి ఏకైక పుత్రుడుంటున్నాడు. వాడు ఏదో ఆడుకుంటున్నాడు. బాల్‌ను తెచ్చుకుందుకు మూలకు వెడితే తేలు కుట్టింది. 'నాన్నా తేలు కుట్టింద'ని ఏడ్చుకుంటూ వచ్చాడు. కుమారుడంటే చాలా ప్రేమ తండ్రికి. కుమారునికి తేలుకుట్టిందని డాక్టరు దగ్గరకు పరుగెత్తాడు. డాక్టరు ఆయింటుమెంటు ఇచ్చి "తేలుకుట్టిన దగ్గర దీనిని పెట్టు. కొంత మత్తెక్కుతుంది, నొప్పి తెలియదు" అన్నాడు. కానీ ఈ తండ్రి ఆత్రుతగా ఏమాత్రం గుర్తించక "ఎక్కడ తేలుకుట్టిందిరా?" అన్నాడు. 'నాన్నా ఆ మూల కుట్టింది' అన్నాడు. ఈ ఆయింటుమెంటు తీసుకునిపోయి ఆ మూల రాసాడు. ఆ మూల రాస్తే ఈ నొప్పి పోతుందా! ఎక్కడ కుట్టిందో అక్కడ రాయాలిగానీ. తేలు ఏ మూల కుట్టిందో ఆ మూల రాస్తే నొప్పి పోతుందా! ఈనాటి ప్రయత్నములన్నీ అలాగే ఉన్నాయి.

**రూప, నామములు వేరుగాని, దైవము ఒక్కడే!**

మన అశాంతి ఎక్కడ నుండి వచ్చింది? దానిని గుర్తించి మన అశాంతిని నిర్మూలనం గావించుకొనేందుకు తగిన ప్రయత్నం చేయాలి. ఆ సత్యాన్ని గుర్తించుకోలేక బాధ ఒక చోట ఉంటే ఇంకొక చోట దాని నివారణ ప్రయత్నం చేస్తున్నాము. భగవంతుడు ఎక్కుడున్నాడని ఊరూరా తిరుగుతున్నాము. కొండలన్నీ తిరుగుతున్నాము. హిమాలయములు తిరుగుతున్నాము. దైవము ఎక్కడ లేడు? ఎక్కడ చూచినా ఉన్నాడు. దైవం ఎక్కడో బయట లేడు. నీ హృదయ స్థాయిలోనే ఉన్నాడు. He is with you, in you, around you, above you, below you. అలాంటి దైవత్వంకోసం ఎక్కడో నీవు ప్రయత్నం చేస్తుంటే ఎలా దొరుకుతాడు? నీ దృష్టిని అంతర్ముఖం గావించుకో. విశ్వాసము నీవు దృఢపరచుకో. అంతేగానీ ఇక్కడ దైవముంది అక్కడ లేడు అనుకునేవాడు సరైన జ్ఞాని కాదు.

**ఇక్కడ అక్కడ ఎక్కడ చూచిన**
**ఒక్కడై ఆత్మలో మక్కువ ఉండును.**

ఎక్కడ చూచినా ఒక్కడే ఉంటున్నాడు. రెండవది లేనే లేదు. "ఏకమేవ అద్వితీయం బ్రహ్మ." నీ దేవుడు, నా దేవుడు అని లేదు. ఇవన్నీ కేవలం అజ్ఞానముయొక్క లక్షణములు. రాముడు

sri sathyasai vachanamrutam

వేరు, కృష్ణుడు వేరు కాదు. శివుడు వేరు, రాముడు వేరు కాదు. రూపనామములు వేరుగానీ దైవము ఒక్కడే. ఇట్టి ఏకత్వాన్ని విశ్వసించి ఎక్కడైనా సరే హృదయపూర్వకంగా ప్రార్థించు. అక్కడ వెంటనే సాక్షాత్కరిస్తాడు.

ఈ సత్యప్రేమ తత్త్వాన్ని ప్రబోధించే నిమిత్తమై సాయిరాముడు అవతరించాడు. ఎక్కడ చూచినా ఉండే దైవమును చూపించే నిమిత్తమే నేను వచ్చినది. ఎక్కడ చూచినా ఉన్నాడంటే సాయి ఎందుకు రావాలి? అనుకుంటారు. కానీ చెప్పేవాడు ఒకడు ఉండాలి కదా.

**ప్రమిద, నూనె, వత్తి కలవు. దీపంపు వెలుగు కలుగునా?**
**పూలు, సూది, దారమున్న పుష్పమాల తానగునా?**

కుట్టేవాడు ఒకడు ఉండాలి కదా! అదేరీతిగా దైవము ఎక్కడ చూచినా ఉన్నాడని చెప్పేకోసమని ఒకడు రావాలి.

**రైలు పరుగును నడిపించు డ్రైవరుండ**
**ఆటోమేటికు లైటుకు అధిపుడుండ**
**ఒకడు జగతిని సృష్టింపనుండవలదె!**

రైలును నడుపుటకు ఒక డ్రైవరుండాలి కదా. ఆటోమేటికు లైటును నియంత్రించేవాడు ఒకడు ఉండాలి కదా! అట్లే, జగత్తును సృష్టించుటకు ఒకడు ఉండాలి. ఎక్కడ చూచినా ఉన్నాడని చెప్పటానికి ఒకడు కావాలి. ఆవిధముగా తెల్పుటకు వచ్చేవే అవతారములంతా. అవతారములు కేవలము తెలుపుటకే కాదు, తమ ప్రేమను సర్వులకు పంచే నిమిత్తము రావాలి. కానీ మీ హృదయ పాత్ర ఎంతో అంతయే మీకు చిక్కుతుంది. దర్శన స్పర్శన సంభాషణలచేత మీ పాత్ర పెద్దది చేసుకోవాలి. ఎంత పెద్దది తీసుకుంటే అంత అమృతము లభిస్తుంది.

1996 జూలై 2వ తేది  సాయికుల్వంత్‌హాల్‌లో భగవాన్ దివ్యోపన్యాసం

sri sathyasai vachanamrutam